# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 311 బుధవారం 3 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri





# డ్రగ్స్‌పై నిఘా!

- సరిహద్దుల్లో సైన్యంలా రాష్ట్రంలోకి డ్రగ్స్ రాకుండా పోలీసు పహారా ఉండాలి
- మనం ఏ స్థాయిలో ఉన్నా, ఎంత సంపాదించినా మన పిల్లలు బాగుండాలి
- తెలంగాణకు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) నుంచి గంజాయి వస్తోందనే సమాచారం
- దేశంలో ఎక్కడ తీవ్రవాద, ఉగ్రవాద కదలికలు, అరెస్టులు అయినా, బాంబు పేలుళ్లు జరిగినా అదనపు సమాచారం
- రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టి నేరగాళ్లను పట్టుకోవాలని పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్

ఒకప్పుడు గుడుంబా పెద్ద సమస్యని, ఇప్పుడు అది లేదని, ప్రస్తుతం పల్లె, పట్టణం తేడా లేకుండా డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మనం ఏ స్థాయిలో ఉన్నా, ఎంత సంపాదించినా మన పిల్లలు బాగుండాలని కోరుకుంటామని, ఆ పిల్లలే డ్రగ్స్ బారిన పడితే ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) నుంచి గంజాయి వస్తోందనే సమాచారం ఉందని తెలిపారు. చొరబాట్లు, ఇతర సమస్యలు రాకుండా దేశ సరిహద్దుల్లో సైన్యం మాదిరిగానే రాష్ట్ర సరిహద్దుల్లోనూ పోలీసులు అలా అప్రమత్తంగా ఉండి, పహారా కాసి తెలంగాణలోకి గంజాయి మొక్క, డ్రగ్స్ రాకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలోని మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఆపై స్థాయి అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసు శాఖలో సీబీసీఐడీ, ఏసీబీ, గ్రేహౌండ్స్, అక్టోపస్ వంటి విభాగాలు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం సైబర్ నేరాలు, డ్రగ్స్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నందున సైబర్ సెక్యూరిటీ బ్యూరో, యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఏర్పాటయ్యాయన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలు పట్టిపీడిస్తున్నందున వాటిని అరికట్టేందుకు అవసరమైన సామర్థ్యాలను అందిపుచ్చుకోవాలని పోలీసులకు సీఎం సూచించారు. ఐపీసీ, సీఆర్‌పీసీల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలు తెచ్చినందున వాటిపైనా పూర్తి అవగాహన తెచ్చుకోవాలని, అందుకు అవసరమైన శిక్షణ తీసుకోవాలన్నారు. అలా శిక్షణ పొందినప్పుడే సమాజం నుంచి నూతనంగా ఏర్పాటయ్యే సవాళ్లను ఎదుర్కొవచ్చని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ తీవ్రవాద, ఉగ్రవాద కదలికలు, అరెస్టులు అయినా, బాంబు పేలుళ్లు జరిగినా అదనపు సమాచారం కోసం కేంద్ర హోం శాఖ నుంచి ఆయా రాష్ట్రాల పోలీసులు తెలంగాణ ఎస్ఐబీ సహకారం కోరతారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు, హైదరాబాద్ పోలీసులపై అందరికీ నమ్మకం ఉందని, నేరగాళ్ల ఆలోచనను, వాళ్లు వేసే ఎత్తుగడలను ముందే గుర్తించి ఆ నేరాలను అరికట్టే ప్రణాళిక రచించి, అందుకు అవసరమయ్యే శిక్షణ పొందుతున్నందునే తెలంగాణ పోలీసుకు జాతీయ స్థాయి గుర్తింపు ఉందని సీఎం అన్నారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌తో మన ఉత్పత్తులు విదేశాలకు, విదేశీ ఉత్పత్తులు మన దేశానికి వస్తున్నట్లే, నేరగాళ్లు సైతం విదేశాల నుంచే ఇక్కడ నేరాలకు పాల్పడుతున్నారని, వాటిని సమర్థంగా ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పోరాటాలతో ఏర్పడిన తెలంగాణలో పదేళ్లలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో - మిగతా3లో



## లోక్‌సభ నిరవధిక వాయిదా

- లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష కూటమి అసత్యాలను ప్రచారం చేసినా పరాజయం తప్పలేదని ఎద్దేవా
- మోదీ ప్రభుత్వం విపక్ష నేతలపై ఈడీ, సీబీఐ దాడులతో వేధింపులకు గురిచేస్తోందని రాహుల్ విమర్శ
- రాష్ట్రపతి ప్రసంగంలో వికసిత్ భారత్ లక్ష్యాలను వివరించారు
- ఈ దిశగా తమ ప్రస్థానం సాగుతుందని స్పష్టం

# బీఆర్ఎస్‌దే మళ్లీ అధికారం

- తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ గెలిచి 15 ఏళ్లు అధికారంలో ఉంటది
- కాంగ్రెస్ పార్టీకి ఒక లక్షణం ఉంది
- ఒకసారి అధికారంలోకి వస్తే పిచ్చిపిచ్చి పనులన్నీ చేసి ప్రజల చేత ఛీ అనిపించుకునేలా వాళ్ళు ప్రవర్తిస్తారు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో జడ్పీ చైర్మన్లు అందరూ రాష్ట్రం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు
- పజా జీవితంలో ఒకసారి నిలిచిన తర్వాత అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేసేటోళ్లే నిజమైన రాజకీయ నాయకులు



హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తదని, మరో 15 ఏళ్ళు అధికారంలో ఉంటదని ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీకి ఒక లక్షణం ఉందని, ఒకసారి అధికారంలోకి వస్తే పిచ్చిపిచ్చి పనులన్నీ చేసి ప్రజల చేత ఛీ అనిపించుకునేలా వాళ్ళు ప్రవర్తిస్తారని అన్నారు. గతంలో ఎన్టీఆర్ పాలన తర్వాత అలాగే జరిగిందని ఆయన గుర్తుచేశారు. - మిగతా3లో

## ఆగస్టు రెండోవారంలో నీట్-పీజీ పరీక్ష నిర్వహణ..!

- నీట్- పీజీ 2024 ఎంట్రన్స్ ఆన్‌లైన్‌లో నిర్వహణ
- ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 23న నీట్-పీజీ పరీక్ష జరుగాల్సి ఉంది
- కానీ కాంపిటీటివ్ పరీక్షల సమగ్రతపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఒక రోజు ముందు గత నెల 22న -నీట్-పీజీ 2024-పరీక్షను వాయిదా



## ఆ గ్రామ పంచాయతీలు విలీనం చేయాలంటూ రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల లేఖ

- రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో మొత్తం ఏడు మండలాలు విలీనం అయ్యాయి
- భద్రాచలం పట్టణం మినహా మండలంలోని గ్రామ పంచాయతీలు ఏపీలో విలీనం అయిన సంగతి తెలిసిందే.
- పట్టణం శివారు నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విలీనకావడంతో డంపింగ్ యార్డుకు సైతం స్థలం లేక ఇబ్బందులు
- భద్రాచలం ఆనుకొని ఉన్న 5గ్రామ పంచాయతీలు తమను తెలంగాణలో కలపాలంటూ తీర్మానాలు



ఖమ్మం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా నవ్యాంధ్రప్రదేశ్‌లో విలీనమైన భద్రాచలం మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేసేలా చొరవ తీసుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖ రాశారు. ఈనెల ఆరో తేదీన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి - మిగతా3లో

# వర్షాకాలంలోనూ బొగ్గు ఉత్పత్తి తగ్గొద్దు

- జీఎంలకు సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశం
- అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలను, ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఏజెన్సీల నియామకం పూర్తి చేశాం
- ఏరియా యాజమాన్యాలు మరింత శ్రద్ధ వహిస్తూ లక్ష్యాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- 8 గంటల పూర్తి సమయం పనిచేసే విధంగా వారిని చైతన్యం చేయాలి




హైదరాబాద్

ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలని సింగరేణి సీఎం ఎన్ బలరామ్ అన్నారు. వర్షాకాలంలోనూ ఉత్పత్తికి విఘాతం కలుగకుండా రోజుకు 2లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తూ రవాణా - మిగతా3లో




## సంక్షేమానికి సమాధి కట్టేశారు

- నిరుద్యోగులను నిలువునా ముంచేశారు
- రాష్ట్రంలో సంక్షేమాన్ని గాలికి వదిలేశారు
- నిరుద్యోగులు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు
- ఆంక్షలు తప్ప పెన్షన్లు లేవు
- ఒకటో తేదీన జీతాలు ఇస్తామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

# లోక్‌సభ నిరవధిక వాయిదా





18వ లోక్‌సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ బదులిచ్చిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. జులై 24న ప్రారంభమైన 18వ లోక్‌సభ తొలి సమావేశాలు వాడివేడిగా సాగాయి. ఈ సమావేశాల్లో నీట్ వివాదం, మణిపూర్ అల్లర్లపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. మోదీ సర్కార్ లక్ష్యంగా విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలతో విరుచుకుపడ్డారు. రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలను స్పీకర్ ఆదేశాలతో రికార్డుల నుంచి తొలగించినట్టు లోక్‌సభ సెక్రటేరియట్ ప్రకటించడం పెను దుమారం రేపింది. తన వ్యాఖ్యలను పునరుద్ధరించాలని రాహుల్ గాంధీ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. మోదీ ప్రభుత్వం విపక్ష నేతలపై ఈడీ, సీబీఐ దాడులతో వేధింపులకు గురిచేస్తోందని రాహుల్ విమర్శించారు. ఎన్డీయే హయాంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు విపక్షాల విమర్శలను ప్రధాని నరేంద్ర మోదీ తిప్పికొట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష కూటమి అసత్యాలను ప్రచారం చేసినా పరాజయం తప్పలేదని ఎద్దేవా చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ దశాబ్ధంలో భారత్ ఖ్యాతి పెరిగిందని వివరించారు. రాష్ట్రపతి ప్రసంగంలో వికసిత్ భారత్ లక్ష్యాలను వివరించారని, ఈ దిశగా తమ ప్రస్థానం సాగుతుందని స్పష్టం చేశారు. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. సభలో నిన్న, ఇవాళ రాష్ట్రపతి ప్రసంగంపై పలువురు ఎంపీలు తమ అభిప్రాయాలను వెల్లడించారని, వీరిలో కొందరు తొలిసారి ఎంపీలు అయినవారు కూడా ఉన్నారని తెలిపారు.

**నూతన సభ్యుల ప్రమాణం**

# ఆగస్టు రెండోవారంలో నీట్-పీజీ పరీక్ష నిర్వహణ!




పీజీ వైద్యవిద్యా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ – పోస్ట్ గ్రాడ్యుయేట్ (నీట్–పీజీ) 2024 పరీక్ష వచ్చేనెల రెండోవారంలో జరుగనున్నది. సవరించిన పరీక్షా తేదీని వారంలోపు ప్రకటిస్తామని మంగళవారం అధికార వర్గాలు తెలిపాయి. ఆరోగ్యశాఖ, జాతీయ వైద్యశాస్త్ర పరీక్షల మండలి (ఎన్బీఈఎంఎస్) అధికారులతో కేంద్ర హోంశాఖ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. నీట్– పీజీ 2024 ఎంట్రన్స్ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో నీట్–పీజీ 2024 పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై టెక్నికల్ పార్టనర్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సైబర్ సెల్ అధికారులు చర్చించారు. నీట్–పీజీ పరీక్ష తేదీతోపాటు ఈ నెల ఆరో తేదీన జరిగే విదేశీ వైద్యవిద్యా గ్రాడ్యుయేట్ల పరీక్ష నిర్వహణకు సమర్థవంతమైన వ్యవస్థ రూపకల్పనపై చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సమర్ధవంతంగా పరీక్ష నిర్వహణకు అవసరమైన చర్యలపైనా చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీసీఎస్ ప్రధాన ఎగ్జిక్యూటివ్‌ల బృందం.. పరీక్ష నిర్వహణా పద్దతిలో వివిధ అంశాలను అధికారులకు వివరించినట్లు తెలుస్తున్నది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 23న నీట్–పీజీ పరీక్ష జరుగాల్సి ఉంది. కానీ కాంపిటీటివ్ పరీక్షల సమగ్రతపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఒక రోజు ముందు గత నెల 22న -నీట్-పీజీ 2024-పరీక్షను వాయిదా వేస్తున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. నీట్ యూజీ 2024 పరీక్షలు అవకతవకలు జరిగాయని, ప్రశ్నాపత్రం లీకైందన్న ఆరోపణలతో విద్యార్థులు, విపక్షాలు ఆందోళనకు దిగాయి. నీట్ యూజీ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. వివిధ రాష్ట్రాల హైకోర్టుల్లో ఈ విషయమై దాఖలైన పిటిషన్లను తమకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# ప్రియుడి ప్రైవేట్ పార్ట్ కోసేసిన ప్రేయసి



వాళ్లిద్దరూ ఒకరినొకరు ఇష్టపడ్డారు.. ఇద్దరూ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు.. శారీరకంగానూ ఒక్కటయ్యారు. ఇక మిగిలింది అధికారికంగా పెళ్లి చేసుకోవడమే. ఆ పెళ్లి తంతు కోసమే అమ్మాయి ఆశగా ఎదురు చూస్తోంది. కానీ, అబ్బాయేమో తాత్సారం చేస్తూ వస్తున్నారు. పెళ్లి చేసుకుందాం అంటే అప్పుడు, ఇప్పుడు అంటూ దాటవేస్తూ వస్తున్నాడు. కానీ, తన శారీరక వాంఛను మాత్రం తీర్చుకుంటూనే ఉన్నాడు. కొన్ని నెలలుగా ఇదే వ్యవహారం నడుస్తోంది ఇద్దరి మధ్య. అయితే, ఆ అమ్మాయికి ఎక్కడో తేడా కొట్టింది. డైరెక్ట్‌గా పెళ్లి చేసుకుంటావా? లేదా? అని నిలదీసింది. ఇలా దాచి లాభం లేదనుకున్న ఆ అబ్బాయి తన మనసులోని మాటను బయటపెట్టాడు. పెళ్లి చేసుకోనని కరాఖండిగా చెప్పేశాడు. అతను అన్న ఆ మాటతో యువతి ఉగ్రరూపం దాల్చింది. అవసరానికి తనను వాడుకున్నాడనే ఆగ్రహంతో.. యువకుడికి బుద్ధి చెప్పాలని ఫిక్స్ అయ్యింది. ఇంకేముంది.. ప్రేమగా దగ్గరికి తీసుకుని చేతికందిన కత్తితో ఆ యువకుడి ప్రైవేట్ పార్ట్ కోసేసింది. తనలా మరెవరూ మోసపోవద్దనే తానిలా చేశానని చెబుతోంది. మరి ఇంతకీ ఈ ఘటన ఎక్కడ జరిగింది? అసలేం జరిగింది? పూర్తి వివరాలు మీకోసం.. బీహార్‌లోని చాప్రా షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళా డాక్టర్ తన ప్రియుడిని ఇంటికి పిలిచి మరీ అతని ప్రైవేట్ పార్ట్ కోసేసింది. యువతి చాప్రాలోని మధుర ఆస్పత్రిలో ప్రాక్టీస్ చేస్తోంది. అదే ప్రాంతానికి చెందిన వార్డ్ కౌన్సిలర్ వేద్ ప్రకాష్‌తో రెండేళ్ల క్రితం యువతికి పరిచయం అయ్యింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ అమ్మాయితో శారీరక సంబంధం కూడా పెట్టుకున్నాడు. రెండేళ్లుగా వీరి సంబంధం కొనసాగుతూ వస్తుండగా.. ఇటీవలి కాలంలో పెళ్లి అంశాన్ని ప్రస్తావించింది యువతి. రేపు, మాపు అంటూ కాలక్షేపం చేస్తూ వచ్చాడు. తాజాగా పెళ్లి చేసుకుంటావా? లేదా? అని ప్రశ్నించగా.. చేసుకోనని స్పష్టం చేశాడు. దీంతో అతనికి ఎలాగైన బుద్ధి చెప్పాలని ఫిక్స్ అయిన యువతి.. అతన్ని తన ఇంటికి పిలిపించింది. అతనితో రొమాన్స్ చేస్తూనే.. అతని ప్రైవేట్ పార్ట్ కట్ చేసింది. తన వద్ద ఉన్న ఆపరేషన్ కత్తితో ప్రైవేట్ పార్ట్ కోసేసింది. దీంతో అతను పెద్ద ఎత్తున అరుపులు, కేకలు వేయడంతో చుట్టుపక్కన వారు వచ్చారు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించి.. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. యువతిని అదుపులోకి తీసుకున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని.. తనలా మరే యువతి మోసపోకూడదనే ఉద్దేశంతోనే అలా అతని ప్రైవేట్ పార్ట్ కట్ చేశానని యువతి వాంగ్మూలం ఇచ్చింది. యువతిపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# సీబీఐ అరెస్టును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో సీబీఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. పిటిషన్‌పై స్పందన చెప్పాలని సీబీఐని ఆదేశించింది. కేసు విచారణను జూలై 17కి వాయిదా వేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను జూన్ 26న సీబీఐ అరెస్టు చేసింది. అదే నెల 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడంతో మధ్యంతర స్టే విధించింది. మధ్యంతర స్టేను సవాల్ చేయడగా.. హైకోర్టు తోసిపుచ్చింది. మరోవైపు జూన్ 29న కేజ్రీవాల్‌ను సీబీఐ కస్టడీలోకి తీసుకున్నది. ప్రస్తుతం జూలై 12 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సీబీఐ నిబంధనలు ఉల్లంఘించిందని పిటిషన్‌లో కేజ్రీవాల్ పేర్కొన్నారన్నారు. తనను అరెస్టు చేయడానికి ముందు అవసరమైన విధానాలను అనుసరించడంలో దర్యాప్తు అధికారి విఫలమయ్యారని.. అరెస్టు చట్టవిరుద్ధమన్నారు. తనను కస్టడీ నుంచి విడుదల చేయాలని.. సీబీఐ చర్యలు చెల్లవని వాదనలు వినిపించారు. 2022లో ఎఫ్ఐఆర్ నమోదైన దాదాపు రెండేళ్ల తర్వాత అరెస్టు చేయడం అన్యాయమని కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉ న్నారు. కేజ్రీవాల్ ఇప్పటికే ప్రత్యేక కేసులో కస్టడీలో ఉన్నందున, అత్యవసరంగా అరెస్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. అరెస్ట్ మెమోకు సరైన కారణాలు ఉండాలన్నారు.

## అయోధ్యలో ఎస్‌పి అభ్యర్థి గెలుపు శ్రీరాముడి తీర్పు

**యుపిలో ఎస్‌పి 80 ఎంపి సీట్లు గెలిచినా ఇవిఎంలపై నమ్మకం లేదు**

**ఎస్‌పి అధినేత, ఎంపి అఖిలేష్ యాదవ్**

**న్యూ ఢిల్లీ :** అయోధ్యలో ఎస్‌పి అభ్యర్థి గెలుపు శ్రీరాముడి తీర్పు అని ఎస్‌పి అధినేత, ఎంపి అఖిలేష్ యాదవ్ తెలిపారు. అయోధ్యంలో అసత్యంపై సత్యం గెలిచిందని, రామమందిరంపై బిజెపి రాజకీయాలు చేసి ఓడిపోయిందని ధ్వజమెత్తారు. పార్లమెంటు సమావేశాలు సందర్భంగా లోక్ సభలో అఖిలేష్ ప్రసంగించారు. గంగానదిని శుభ్రం చేయనందుకే ఉత్తర ప్రదేశ్ ఓటర్లు బిజెపికి బుద్ధి చెప్పారని, యుపిలో వర్షాలకు నగరాలన్నీ చెరువులుగా మారాయని, పదేళ్లలో యుపిలో బిజెపి ఎం అభివృద్ధి చేయలదేని, ఢిల్లీలాగా యుపిలో ఒక్క ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించలేదని, పిఎం మోడీ చేసి వాగ్ధానాలను మర్చిపోయారని అఖిలేష్ మండిపడ్డారు.లోక్ సభ ఎన్నికలలో ఇండియా కూటమిదే నైతిక విజయమని, ఎన్‌డిఎ నడిచే ప్రభుత్వం కాదు అని, పడిపోయే ప్రభుత్వం అని, బిజెపి 400 సీట్ల ఎజెండా ఫెయిల్ అయ్యిందని చురకలంటించారు. ఆకలి, సంతోషం సూచిల్లో ఎక్కడున్నామో ముందు చూసుకోవాలని. ఆ తరువాత ట్రిలియన్ డాలర్ల ఎకానమీపై ఆలోచన చేయాలని సూచించారు. దేశంలో పంటకు మద్దతు ధర దక్కడం లేదని, ఎన్‌డిఎ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వదలుచుకోలేదని, అందుకే పేపర్ల లీకులు జరుగుతున్నాయని అఖిలేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవిఎంలు తొలగించేదాకా తమ పోరాటం ఆగదని, యుపిలో ఎస్‌పి 80 ఎంపి సీట్లు గెలిచినా ఇవిఎంలపై నమ్మకం లేదన్నారు.

## ఛత్తీస్‌గడ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు హతం



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని నారాయణ్ పూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 11 మంది మావోయిస్టులు హతమయ్యారు. కొహకమెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ధనంది కుర్రేవాయ మధ్య అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భారీగా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కూంబింగ్‌లో ఎస్‌టీఎఫ్‌డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్, ఐటీబీపీ బలగాలు సహా మొత్తం 1400 మంది ఈ కూంబింగ్‌లో పాల్గొన్నారు. ఈ ఎదురుకాల్పుల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు తప్పించుకున్నారు. చాలా మంది గాయాల పాలయ్యారని అంచనా భావిస్తున్నారు. ఇక టనా స్థలంలో భారీ ఎత్తున కూంబింగ్ కొనసాగుతోందని ఐజీ జీ సుందర్ రాజ్ ప్రకటించారు.

## హత్రాస్ తొక్కిసలాట ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ తొక్కిసలాటలో పెద్ద సంఖ్యలో భక్తులు మరణించిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు ఆమె తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టుపెట్టారు. హత్రాస్‌లో జరిగిన ఓ మతపరమైన కార్యక్రమంలో మంగళవారం మధ్యాహ్నం తొక్కిసలాట జరిగింది. రతీభాన్‌పూర్‌లో శివుడికి సంబంధించిన ఆధ్యాత్మిక కార్యక్రమం ముగియగానే స్థానికులు ఒక్కసారిగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ తొక్కిసలాటలో 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మరో వంద మందికిపైగా గాయపడ్డారు.

## మోదీ ప్రసంగిస్తుండగా సభ్యులకు ఆదేశాలు.. రాహుల్‌ను మందలించిన స్పీకర్ ఓం బిర్లా





న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగం ధన్యవాద తీర్మానంపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారంనాడు లోక్‌సభలో సమాధానమిస్తుండగా సభలో గలభా చోటుచేసుకుంది. దీంతో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మందలించారు. ప్రధాని ప్రసంగం ప్రారంభించగానే పోడియం వద్దకు వెళ్లాలంటూ తమ సభ్యులను రాహుల్ ఆదేశించారు. దీనిపై స్పీకర్ వెంటనే స్పందిస్తూ "సభలో మాట్లాడేందుకు మీకు తగిన సమయం ఇచ్చాను. పార్లమెంటు గౌరవాన్ని పాటించండి" అని రాహుల్‌కు సూచించారు. "డియర్ ఎల్‌ఓపీ...ఇది మీకు తగదు. మీకు మాట్లాడేందుకు తగినంత అవకాశం, సమయం ఇచ్చాను. సభానాయకుడు మాట్లాడుతున్నప్పుడు సభకు ఆదేశాలు ఇవ్వడం సరికాదు. పార్లమెంటరీ సంప్రదాయలకు ఇది తగదు. పార్లమెంటు గౌరవాన్ని నిలబెట్టండి. ఈ విధానం సరికాదు. పోడియం వద్దకు వెళ్లమని మీరు సభ్యులను ఆదేశిస్తున్నారు. విపక్ష నేతగా ఇలాగేనా వ్యవహరించేది?" అని రాహుల్‌ను ఓం బిర్లా మందలించారు.

# డ్రగ్స్‌పై నిఘా!

-మొదటిపేజీ తరువాయి

గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. సింగరేణి కాలనీలో ఒక బాధితుని కుటుంబాన్ని, ఔటర్ రింగు రోడ్డులో ఒక బాధితుడైన డాక్టర్‌ను పరామర్శించడానికి వెళితే వారంతా గంజాయికు అలవాటైన వారి వలనే తాము బాధితులుగా మారినట్లు తెలిపారన్నారు. తమ పిల్లలు కార్పొరేట్ స్కూళ్లకు వెళుతున్నారని, తాము రూ.వందల కోట్లు సంపాదించినా ఉపయోగం లేకుండాపోయిందని, తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం పోలీసు వ్యవస్థ రాజకీయ నిఘాపై శ్రద్ధ పెట్టి నేరగాళ్లను వదిలివేయడమేనని సీఎం అన్నారు.



### మితిమీరిన భద్రత వద్దు

రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాలపై నిఘా పెట్టి నేరగాళ్లను పట్టుకోవాలని పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సమాజంలో ఉన్న ప్రజలు ఎన్నుకుంటేనే తాము ప్రజా ప్రతినిధులుగా వచ్చామని, తమకు మితిమీరిన సెక్యూరిటీ అవసరం లేదని, ఎవరికి ఎంత అవసరమో అంతే సెక్యూరిటీ ఇవ్వాలని, భద్రత విషయంలో తనతో సహా ఎవరికీ అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని డీజీపికి సీఎం స్పష్టం చేశారు. భద్రత, ఇతర విషయాల్లో కొన్ని సార్లు పోలీసుల అతి ఉత్సాహం చూపుతారని, ఆ ఉత్సాహం, శక్తి నేరాల నియంత్రణపై చూపాలని హితవు పలికారు. పోలీసు కుటుంబాల పిల్లలు రాణించలేరనే అపవాదు సమాజంలో ఉందని, ఇందుకు ప్రధాన కారణం విధుల్లో పడి కుటుంబాలకు, పిల్లలకు సరైన సమయం కేటాయించకపోవడమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే సైనిక స్కూళ్ల మాదిరే పోలీసు పిల్లల కోసం పోలీసు స్కూళ్లు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలంలో పోలీసు స్కూల్ ఏర్పాటు చేస్తామని, ఆరు నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందులో ఉంటుందని, హోంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు చదువుకోవచ్చని తెలిపారు. సామర్థ్యం, పని తీరుతోనే బదిలీలు కోరుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సామర్థ్యం ఉన్నవారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని, అందుకు సందీప్ శాండిల్య ఉదాహరణ, తన ప్రభుత్వంలో రిటైర్ అయిన వారిని పదవీ కాలం పొడిగించిందని ఒక్క సందీప్ శాండిల్యకేననే విషయం గుర్తుంచుకోవాలన్నారు.

### నేనూ పోలీసు కుటుంబం నుంచే వచ్చా..

పోలీసుల పిల్లలు తాము పోలీసుల కుటుంబాల నుంచి వచ్చామని చెప్పుకునేందుకు ఇబ్బంది పడతారని, అందుకు కారణం పోలీసు శాఖపై సమాజంలో ఉన్న అభిప్రాయమేనని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆ అభిప్రాయం మారాలని, తన తండ్రి, తన అన్న పోలీసు అని గర్వంగా చెప్పుకునేలా మన ప్రవర్తన ఉండాలని సూచించారు. తన అన్న భూపాల్ రెడ్డి వనపర్తిలో కానిస్టేబుల్ గా పని చేసి తనను చదివించారని, తన అన్న పెంపకంతోనే తాను ఈ రోజు సీఎం స్థాయికి వచ్చానని ఆయన వెల్లడించారు. తాను సీఎంగా ఉన్నప్పుడే పోలీసు శాఖ సమస్యలు పరిష్కరించుకోకుంటే జీవితకాలంలో అవి పరిష్కారం కావన్నారు. తాను జడ్పీటీసీ సభ్యునిగా ఉన్నపుడు పోలీసు అధికారులంటే ఒక గౌరవం, భయం ఉండేదని, క్రమంగా అది పడిపోయిందని, దానిని పునరుద్ధరించేలా ప్రయత్నించాలని సూచించారు. నేరాల నియంత్రణలో ఎస్‌హెచ్‌వోలే కీలక పాత్ర అని, పైఅధికారుల పని పర్యవేక్షణ మాత్రమేనని, ఈ విషయం గుర్తించి పోలీసులకు వన్నెతెచ్చేలా పని చేయాలని సీఎం సూచించారు.

### తెలంగాణ బ్రాండ్ హైదరాబాద్..

తెలంగాణ బ్రాండే హైదరాబాద్ అని, హైదరాబాద్ పోలీసు అంటే తెలంగాణకు గుండెకాయ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలో నేరాలను నియంత్రించకపోతే, అరాచకాలను అరికట్టకపోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పోలీసులు అంతా తమ బాధ్యతను ప్రతి రోజు గుర్తుపెట్టుకొని హైదరాబాద్ బ్రాండ్ ఇమేజిని కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఎం రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ రవి గుప్తా, టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, అవినాష్ మహంతి, తరుణ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

## ఆ గ్రామ పంచాయతీలు విలీనం చేయాలంటూ రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల లేఖ..



-మొదటిపేజీ తరువాయి

భేటీ నేపథ్యంలో లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో విలీనమైన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకులపాడు పంచాయతీలను భద్రాచలంలో కలపాలంటూ మంత్రి లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో మొత్తం ఏడు మండలాలు విలీనం అయ్యాయి. భద్రాచలం పట్టణం మినహా మండలంలోని గ్రామ పంచాయతీలు ఏపీలో విలీనం అయిన సంగతి తెలిసిందే. శ్రీరాముడు కొలువైన రామాలయంతో టెంపుల్ టౌన్‌గా భద్రాచలాన్ని ఏర్పాటు చేశారు. పట్టణం శివారు నుంచి ఆంధ్రప్రదేశ్‌లో విలీనకావడంతో డంపింగ్ యార్డుకు సైతం స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు మంత్రి తెలిపారు. భద్రాచలం- చర్ల ప్రధాన రహదారిలో ఎటపాక గ్రామ పంచాయతీ ఆంధ్రాలో కలవడంతో అంతరాష్ట్ర సరిహద్దు సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి వివరించారు. విలీన గ్రామాల వల్ల భద్రాచలం నుంచి చర్ల వెళ్లేవారికి రాకపోకల్లో, అధికారులకు సాంకేతిక, పాలనాపరమైన సమస్యలు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలం రామాలయం దేవస్థాన భూములు పురుషోత్తమపట్నం గ్రామంలో ఉండటంతో ఆలయ అధికారుల పర్యవేక్షణకు పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నట్లు మంత్రి తుమ్మల లేఖలో సీఎంకు వివరించారు. భద్రాచలం ఆనుకొని ఉన్న 5గ్రామ పంచాయతీలు తమను తెలంగాణలో కలపాలంటూ తీర్మానాలు చేశారని చెప్పారు. ప్రజల ఇష్టాన్ని దృష్టిలో పెట్టుకొని భౌగోళిక పరమైన విభజనతో ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయితీలను తిరిగి తెలంగాణలో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఇద్దరు ముఖ్యమంత్రులు పరిపాలనా సౌలభ్యం, ప్రజా సంక్షేమం కోసం భద్రాచలంలో కలిపేలా నిర్ణయం తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

## వర్షాకాలంలోనూ బొగ్గు ఉత్పత్తి తగ్గొద్దు




-మొదటిపేజీ తరువాయి

చేయాలని.. రోజుకు 13లక్షల క్యూబిక్ మీటర్ల బర్డెన్‌ను తొలగించాలని జీఎంలను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఇతర కంటిన్యూయస్ మైన్స్ పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ఉత్పత్తికి నష్టం వాటిల్లకుండా హాల్ రోడ్లను ఎప్పటికప్పుడు పటిష్టం చేసుకోవాలని.. క్వారీల్లో నిలిచిన వర్షం నీటిని పంపింగ్ చేయాలని, ఏదైనా షిఫ్ట్‌లో వర్షంతో ఉత్పత్తికి నష్టం కలిగితే మరుసటి షిఫ్ట్‌లో భర్తీ చేయాలని సూచించారు.
ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలను, ఓవర్ బర్డెన్ తొలగించడానికి ఏజెన్సీల నియామకం పూర్తి చేశామని, ఏరియా యాజమాన్యాలు మరింత శ్రద్ధ వహిస్తూ లక్ష్యాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకుందన్నారు. ఇందులో మరో 5 ఏళ్లలో మొత్తం 10 గనులు ప్రారంభించుకోవాల్సిన అవసరం ఉందని, దీనికి సన్నాహాలు ముమ్మరం చేయాలన్నారు. ఈ ఏడాది మరో మూడు నెలల్లో ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గనులకు సంబంధించిన మిగిలిన అనుమతులు, ఏర్పాట్లను సమయానుకూలంగా పూర్తి చేయాలన్నారు. ఉద్యోగులందరూ తమకు కేటాయించిన 8 గంటల పూర్తి సమయం పనిచేసే విధంగా వారిని చైతన్యం చేయాలని, ఈ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమీక్ష సమావేశంలో వివిధ విభాగాల డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జీ వెంకటేశ్వర్‌రెడ్డి, దేవేందర్, సీపీపీ జీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌దే మళ్లీ అధికారం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీ జడ్పీ చైర్మన్లతో మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జడ్పీ చైర్మన్లు అందరూ రాష్ట్రం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని, విజయవంతంగా పదవీకాలాన్ని పూర్తి చేసినందుకు అందరికీ శుభాకాంక్షలని చెప్పారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా జీవితంలో ఒకసారి నిలిచిన తర్వాత అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పని చేసేటోళ్లే నిజమైన రాజకీయ నాయకులని కేసీఆర్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నీ సవ్యంగా నడిచాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు, తాగునీటి ఇబ్బందులతోపాటు శాంతి భద్రతల సమస్య తలెత్తి మతకల్లోలాలు కూడా చెలరేగడం బాధ కలిగిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పుడు ఉన్న అధికారులే ఇప్పుడు ఉన్నప్పటికీ శాంతి భద్రతల సమస్య ఎందుకు వస్తున్నదో ఆలోచించాలని కేసీఆర్ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించిందని పేర్కొన్నారు. పార్టీ నాయకులను సృష్టిస్తుంది కాని నాయకులు పార్టీని సృష్టించరని, మంచి యువ నాయకత్వాన్ని తయారు చేస్తామని పేర్కొన్నారు. అత్యున్నత పదవులు అనుభవించి పార్టీని వీడుతున్న వారిని 'నాలుగు రోజులు పదవులు లేకపోతే ఉండలేరా..?' అని ప్రజలే అసహ్యించుకుంటున్నారని చెప్పారు. రాజకీయాల్లో ఉన్న వాళ్లకు సౌజన్యం, గాంభీర్యం ఉండాలని.. అలా కాకుండా కొందరు కేసీఆర్ ఆనవాళ్లను చెడిపేస్తామంటున్నారని, కేసీఆర్ తెలంగాణ తెచ్చిండు కాబట్టి మరి దాన్నే చెడిపేస్తరా అని ఆయన ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చినంక గతంలో వైఎస్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ , ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాలను పేర్లు మార్చకుండా ఇంకా బాగా అమలు చేశామని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చే నాటికి చెట్టుకొకడు పుట్టకొకడు అయ్యిండనే బాధతో వ్యవసాయాన్ని స్థిరీకరణ చెయ్యాలని రైతుబంధు పథకాన్ని అద్భుతంగా రైతులందరికీ అందించామన్నారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం రకరకాల కారణాలతో అసలు ఆ పథకానికే ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు ఏడాది పొడవునా పంటలను సాగు చేస్తూనే ఉంటారని, సాగు లెక్కలు ఇతరత్రా కారణాలు చూపుతూ రైతుబంధును అమలు చేస్తే అవినీతి మొదలైతదని అన్నారు. మళ్ళీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని కొంచెం సమన్వయంతో ఓపిక పట్టాలని కోరారు. మరో రెండేళ్లలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని, తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య 160 వరకు పెరగొచ్చని కేసీఆర్ అన్నారు. మహిళలకు కూడా ఎక్కువ అవకాశాలు వస్తాయన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా జరగాల్సి ఉన్నదని, ఈసారి బీఆర్ఎస్ తరపున ఎవరికి బీ ఫామ్ దక్కితే వాళ్లదే విజయమని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పార్టీ అన్ని స్థాయిల్లోని కమిటీల ఏర్పాటు ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. సోషల్ మీడియాను కూడా పటిష్టంగా తయారు చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లో హష్మీ అనే ఒక ప్రొఫెసర్ పేద మహిళల కోసం 71 వేల పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వారిని ఆదుకున్న విధానం గురించి, జీరో పొల్యూషన్ నగరాల్లో అక్కడి మేయర్లు ప్రజల్లో మమేకమైన విధానం గురించి కేసీఆర్ వివరించారు.



# సంక్షేమానికి సమాధి కట్టేశారు..

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా తయారైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సంక్షేమానికి సమాధి కట్టేశారు.. నిరుద్యోగులను నిలువునా ముంచేశారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. నిరుద్యోగులు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆంక్షలు తప్ప పెన్షన్లు లేవు. ఒకటో తేదీన జీతాలు ఇస్తామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మే, జూన్ మాసాలకు సంబంధించిన పెన్షన్లు ఇవ్వలేదు. పక్కనే సీఎం చంద్రబాబు పాత బకాయిలు కలిపి ఏడు వేల పెన్షన్ ఇచ్చిండు. రేవంత్ నెలకు పెన్షన్ నాలుగు వేలు చేస్తా అని చేయలేదు. ఇచ్చే రెండు వేల పెన్షన్ కూడా రెండు నెలల నుంచి ఇవ్వడం లేదు. అర్హులైన వారికి పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో పారిశుధ్యం పడకేసింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. ఏడు నెలల కాలంలో ఏడు పైసలు కూడా విడుదల చేయలేదు. ఆ రోజు కేసీఆర్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి కింద ప్రతి పల్లెకు జనాభా ప్రతిపాదన నిధులు ఇచ్చాం. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చాం. కాంగ్రెస్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి నెలలు గడుస్తుంది. ఎన్నికలు పెట్టే పరిస్థితి లేదు. ఈ నెల 4న జిల్లాల పరిషత్‌ల పదవీకాలం ముగియనుంది. దానికి ఎన్నికలు పెట్టే ఆలోచనలో లేదు. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసి పారిశుద్ధ నిర్వహణను మెరుగుపరచాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

### రైతు ప్రభాకర్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : హరీశ్‌రావు




ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం పరిధిలోని చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్(43) ఆత్మహత్యపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. రైతు ప్రభాకర్ ఆత్మహత్య దురదృష్టకరం.. ఆయన కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన పాపానికి ఆత్మహత్య చేసుకుంటున్నాను అని ఒక రైతు వీడియో విడుదల చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మాటలు వింటే హృదయ విదారకంగా ఉన్నాయి. ఆయన కన్నీళ్లు పెట్టుకున్న తీరు చూస్తుంటే చూసిన వారికి కూడా కన్నీళ్లు వస్తున్నాయి. ఆయన ఆత్మహత్య దురదృష్టకరం. ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కేసు నమోదు చేయాలని ఆయన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. కేసు నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరిస్తున్నట్లు తెలిసింది. ప్రభాకర్ తన ఆత్మహత్య కంటే విడుదల చేసిన వీడియోనే.. మరణ వాంగ్మూలంగా స్వీకరించి పోలీసులు కేసు నమోదు చేయాలి. ఈ ఘటనపై స్పందించాల్సిన పోలీసులు కూడా స్పందించట్లేదు.ఆయన తండ్రి ఫిర్యాదు తీసుకునేందుకు కూడా నిరాకరిస్తున్నారు అని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయి. ప్రభాకర్ ఆత్మహత్యకు కాంగ్రెస్ పార్టీనే కారణం. తన భూమిలోని మట్టిని జేసీబీ, ప్రొక్లెయిన్‌తో చెల్లాచెదురుగా చేశారని ఎస్ఐ, ఎమ్మార్వో, కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశానని ప్రభాకర్ చెప్పాడు. ఆ ముగ్గురిలో ఏ ఒక్కరైనా స్పందించి ఉంటే ఆయన బతికుండేవాడు. అంటే పాలన సరిగాలేదు. ఎక్కడా న్యాయం జరగలేదు. తనకు చావే దిక్కు అని ప్రాణాన్ని బలితీసుకున్నాడు. ప్రతిపక్షం తరపున ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. ప్రభుత్వం తప్పు చేస్తే పోరాటం చేయడమే ప్రతిపక్షంగా మా బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రభాకర్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నాం. ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలి. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే తక్షణమే స్పందించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.

# యువత స్వయం ఉపాధిని ఎంచుకోవడం హర్షణీయం: నీలం మధు




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధి ఎంచుకొని వ్యాపార రంగంలోకి ప్రవేశించడం హర్షినియమని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం గుమ్మడిదల మండల కేంద్రంలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ఆంజనేయులు, సుధాకర్ ఏర్పాటు చేసిన టీ టైం షాప్ ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధిని ఎంచుకోవడం ద్వారా తమ సొంత కాళ్లపై తాము నిలబడడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు.ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ప్రారంభించిన ఈ వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో తిరుమలవాస్, బాల్ రాజ్,మల్లేష్,గోపాల్,మహేష్,శ్రీనివాస్,బిక్షపతి రెడ్డి, యాదగిరి, నాగరాజు, వెంకటేశ్,సురేష్, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తధితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల్లో 'ప్రత్యేక మహాజన సభలు




వాస్తవ నేస్తం,ఏర్గట్ల: తాళ్ల రాంపూర్, ఏర్గట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి లు ప్రత్యేక మహాజన' సభను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుబంధు పథకం అమలుపై చర్చ జరిగింది. ఒక పట్టాదారు పాసు పుస్తకంపై ఎంత భూమి ఉన్నప్పటికి కేవలం 10 ఎకరాలకు మాత్రమే రైతుబంధును అమలు చేయాలని పాలకమండలి సభ్యులు, రైతులు ఏకగ్రావంగా ఆమోదించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్, సంఘం ఉపాధ్యక్షులు సింగసారం గంగారాం, జీ కే శ్రీనివాస్ రెడ్డి,జిల్లా రిజిస్ట్రార్ పాపయ్య, ఏఈవోలు సాయిసచిన్, శివాని, కార్యదర్శులు జక్కని శ్రీనివాస్, గణేష్ పాలకమండలి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చాలి

**జార్ఖండ్ తరహాలో పింఛన్లు ఇవ్వాలి**

**తెలంగాణ ఉద్యమ రాష్ట్ర నాయకురాలు సువర్ణ సులోచన**




**మంథని :** తెలంగాణ కోసం పోరాడి తెలంగాణ సాధించుకునే క్రమంలో మాపై చాలా కేసులు నమోదయ్యాయి, ఎన్నోసార్లు జైల్లో కెళ్లినం మాలాంటి ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఝార్ఖండ్ రాష్ట్రం తరహాలో తమకు పింఛన్లు అందించాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకురాలు సువర్ణ సులోచన సీనియర్ న్యాయవాది మాదాటి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనునిత్యం పోరాటాలు చేసి తెలంగాణ వచ్చేంతవరకు శ్రమించిన మా ఉద్యమకారులని మివల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించబోతుందని తెలంగాణ ఉద్యమకా కారులను తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రోత్సహించిన కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక తెలంగాణ కోసం అమరులైన 1500 మంది అమరుల కుటుంబాలను పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి పదవి అలంకరించిన తర్వాత మా తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా పక్కకు పెట్టేసి గుర్తించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారిని తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయాలని కుట్రలు చేసిన నాయకులకు కెసిఆర్ వారిని చేరదీసి అందలం లెక్కించి మంత్రులను చేసిన ఘనత కల్వకుంట చంద్రశేఖర్ కి దక్కుతుందని వారన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రకటిస్తే ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కనుమరుగై పోతుందని రాజకీయ సర్వేలు చెప్పిన తల్లి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడానికి మొగ్గుచూపిందని తెలంగాణ వస్తే అమరుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలంగాణ ప్రజలు బాగుపడతారని గుర్తించి తెలంగాణను ఇవ్వడం జరిగిందని వారన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మా ఉద్యమకారులను గుర్తించి మాకు నివాస భూమి, ఇందిరమ్మ ఇండ్లు పింఛన్లు బస్సు ప్రయాణానికి బస్సు పాసులు అందించి ఆదుకోవాలని కోరారు. ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతున్నామని వారన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు తోకల మల్లేష్ చిదురాల మధుకర్ రెడ్డి ఎస్కే ముజీబ్, మిరియాల రామిరెడ్డి, దాసరి శంకర్, బొడ్డు వెంకటేశ్వర్లు ఎస్.కె చాంద్ భాషా లు పాల్గొన్నారు.

# జడ్పీ చైర్మన్, జడ్పీటీసీ,ఎంపిపిలకు సన్మానం

**కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 2019 నుండి 24 వరకు పదవి బాధ్యతలు పూర్తి చేసుకున్న జడ్పీ చైర్మన్, జడ్పీటిసి, ఎంపిపి లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హజరయ్యారు. జడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ గణపతి, వైస్ చైర్మన్ పెరాల గోపాల్ రావు , జడ్పీటిసి, ఎంపిపి లను మంత్రి ఘనంగా సత్కరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా పరిషత్ వీడ్కోలు సభకు రావాలని జిల్లా పరిషత్ చైర్మన్ ,సీఈఓ ఆహ్వానించారు. 5 సంవత్సరాలు పదవి కాలం పూర్తి చేసుకున్న జిల్లా పరిషత్ సభ్యులకు ,ఎంపిపి లకు శుభాకాంక్షలు. 5 సంవత్సరాల ప్రజా జీవితంలో నిధులున్నా ,లేకున్నా అనేకా కష్టాలు వచ్చినా ప్రజల సమస్యలు ఎదుర్కొనీ మంచి పేరు సంపాదించుకున్నారు. జడ్పీటిసి సభ్యునిగా మీ పదవి ముగిసినప్పటికీ ప్రజా జీవితంలో మీరు మళ్ళీ ఏదో ఒక రూపంలో ఎన్నికై ప్రజలతో ఉండాలనీ కోరుకుంటున్న. నేను గతంలో కొత్తగా సింగిల్ విండో అధ్యక్షుడు అయిన తరువాత పెద్దల ఆశీర్వాదం తో సహకార రంగంలో విజయవంతంగా పని చేశా. కరీంనగర్ జిల్లా పరిషత్ కు మా రాజకీయ గురువు చొక్కారావు గతంలో చైర్మన్ గా అయ్యారు... తరువాత చాలా మంది ఎన్నికయ్యారు. ప్రజా సమస్యలు పరిష్కరించిన వాటికి సంతృప్తిగా తీపి గుర్తుగా ఉంటాయి. కొన్ని పరిష్కారం కానివి ఉన్న వాటిని మళ్ళీ పరిష్కారం దిశగా పదవుల్లో ఉన్నా లేకున్నా అవి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలి. భవిష్యత్ లో స్థానిక సంస్థలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని మా ముఖ్యమంత్రి రేవంత్ గారి నేతృత్వంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పదవుల్లో ఉన్నన్ని రోజులు రాజకీయాలకు అతీతంగా స్నేహపూర్వకంగా ,అరోగ్యకైరమైన వాతావరణం లో పని చేశాం. రాబోయే కాలంలో మీకు మరింత మంచి జరగాలని , భవిష్యత్ లో మరిన్ని పదవులు రావాలని కోరుకుంటున్న. పదవి పూర్తి చేసుకున్న జడ్పీటిసి లకు శుభాకాంక్షలు తెలుపుతున్న. రాజకీయాలకు అతీతంగా సహృద్భావ వాతావరణంలో కలిసి పనిచేస్తున్నాం. ఏ సమస్య ఉన్న పార్టీలకు అతీతంగా ఓపెన్ గా చెప్పుకోవచ్చు. మీారంతా భవిష్యత్ లో మరిన్ని పదవులు సాధించవచ్చు.. ప్రజా జీవితంలో మరింతగా ముందుకు పోతుండాలని కోరుకుంటున్నానని అన్నారు.

## బాధిత కుటుంబానికి మన ఊరు మనబడి యూఏఈ ఎన్ఆర్ఐ సంఘం ఆర్థిక సహాయం



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని తాళ్ళారాంపూర్ గ్రామంలో ఇటీవలే బోధసు గంగాధర్ ప్రమాదవశాత్తు తాటి చెట్టునుండి జారిపడి మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. అందులో ఇద్దరు కుమారులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్న విషయం తెలుసుకున్నతాళ్ళరాంపూర్ మన ఊరు మనబడి యూఏఈ ఎన్ఆర్ఐ సంఘం బాధిత కుటుంబ సభ్యులకు యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉత్కం శ్యామ్ సుందర్ గౌడ్, సృజన్ బండి, బోదసు దేవేందర్ , ప్రతాప్ ముదిరాజ్, అడెం గంగారెడ్డి లు పాలుగోన్నారు.

## ప్రపంచవ్యాప్త విస్తరణలో భాగంగా టైడీ కొనుగోలును ప్రకటించిన ఫెనోమ్




**హైదరాబాద్ :** ఉద్యోగులకు హైర్ నుండి రిటైర్ వరకు అసాధారణమైన ప్రీ-బోర్డింగ్ మరియు ఆన్‌బోర్డింగ్ అనుభవాలను అందించడంపై దృష్టి సారించిన మానవ వనరుల సాంకేతిక సంస్థ టైడీని కొనుగోలు చేస్తున్నట్లు ఫెనోమ్ ఈరోజు ప్రకటించింది. ఈ ఐదో స్వాధీనం మరియు ఇంటెలి జెంట్ టాలెంట్ ఎక్స్ పీరియన్స్ ప్లాట్‌ఫామ్ పోర్ట్ ఫోలియోకు ఈ అదనపు జోడింపు ఉద్యోగులకు ఉత్పాద కత కోసం సన్నద్ధమయ్యే సమయాన్ని తగ్గించడానికి ఫెనోమ్ కు గల విజన్ ను బలపరుస్తుంది. అదే స మయంలో హెచ్ ఆర్ ప్రాక్టీషనర్స్ కు సమర్థవంతమైన అనుభవాలను అందిస్తుంది. ఇవన్నీ ఒకే ప్లాట్‌ఫామ్ నుండి సృష్టిస్తుంది.ఈ స్వాధీనం గురించి ఫెనోమ్ సీఈఓ, సహ-వ్యవస్థాపకుడు మహే బైరెడ్డి మాట్లాడుతూ, "టైడీ చేరికతో, మేం ఆయా సంస్థల ఉద్యోగులు మొదటి నుండి ఉత్పాదకతను కలిగి ఉండేలా సంస్థలకు సాధికారికత అం దించడానికి సిద్ధంగా ఉన్నాం. ఆన్‌బోర్డింగ్ అనేది టాలెంట్ జర్నీలో కీలకమైన సందర్భం. ఇక్కడ అభ్యర్థులు ఉద్యోగులుగా మారుతారు మరియు ప్రతిభ గల నాయకులు వారిని విజయం సాధించేందుకు నియమిం చుకోవచ్చు. టైడీతో మేం అద్భుతమైన ఎండ్-టు-ఎండ్ టాలెంట్ అనుభవాన్ని సృష్టించడానికి అభ్యర్థులు, ఉద్యోగుల మధ్య సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తాం. ఉద్యోగి మొదటి రోజు ముందు వరకు అవసర మైన కార్యాచరణ దశలు, ధృవీకరణలు, డాక్యుమెంటేషన్‌ను పూర్తి చేయడానికి వీలు కల్పిస్తుంది. ప్రతిభా వంతులను పొందడానికి తోడ్పడుతుంది. ప్రతిభ నిర్వహణ బృందాల కీలకమైన అవసరాలను ఇది పరిష్క రిస్తుంది. ఇది ఉద్యోగులపై శాశ్వతమైన, సానుకూల ప్రభావాన్ని చూపేలా కొత్త నియామకాలకు సంబంధిం చి వేగవంతమైన, పారదర్శకమైన, సులభమైన అనుభవాన్ని సృష్టిస్తూ ఉత్పాదకతకు సమయాన్ని తగ్గిస్తుంది" అని అన్నారు.టైడీ ప్రారంభమైనప్పటి నుండి, ప్రతి ఒక్కరికీ పని సజావుగా సాగాలని మేం కోరుకున్నాం" అని టైడీ సహ వ్యవస్థాపకుడు కిరణ్ మీనన్ అన్నారు. "వ్యక్తిగత-ఆధారిత విభజన, ఇంటిగ్రేషన్‌లు, ఆటోమేషన్, ఇంటెలి జెన్స్ ను ఒకే పరిష్కారంగా కలపడం ద్వారా ఆన్‌బోర్డింగ్ అనుభవాలు, సంక్లిష్ట హెచ్ఆర్ కార్యకలాపాల ను మెరుగుపరచడానికి అవకాశం ఉందని మేం గ్రహించాం. పరిశ్రమలో అత్యుత్తమ నియామకం, వృద్ధి, మ రియు రిటెన్షన్ ఫలితాలను అందించడానికి టైడీ సాంకేతికత, వర్క్ ఫ్లోలు ఫెనామ్ సమగ్ర విధానంలో కీల కాంశంగా మారుతాయని మేం విశ్వసిస్తున్నాం" అని అన్నారు.

## క్రమశిక్షణతో విధులు నిర్వహించండి:



**కమాన్‌పూర్ :** చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏ.పీ. ఏ. జీ.ఎం. కే.వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగుల డిపెండెంట్ లకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను ఇటీవల జారీ చేయడం జరిగినది. అందులో 69 మంది అభ్యర్థులకు స్థానిక ఎం.వి.టి.సి. లో శిక్షణ కొరకు ఉత్తర్వులను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంగళ వారం ఎం.వి.టి.సి నందు నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఉద్దేశించి ఏ.పీ.ఏ. జీ.ఎం. శ్రీ కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థ లో ఉద్యోగం రావడం అదృష్టమని, సంస్థ ఇచ్చేటువంటి శిక్షణ ను సద్వినియోగం చేసుకొని, ఉద్యోగంలో చేరిన తరువాత క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని అన్నారు. అంతేకాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రత తో విధులు నిర్వహించాలని, ఎం.వి.టీ.సి శిక్షణ పూర్తయిన వెంటనే ఇచ్చిన గడువులోపు విధులలో చేరాలని అన్నారు. సింగరేణి సంస్థ లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడానికి ప్రస్తుతం చాలా అవకాశాలు ఉన్నందున, దీనిని సద్వినియోగం చేసుకొని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల కోసమే కాకుండా వారి కుటుంసభ్యుల కోసం కూడా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కావున ప్రతి ఉద్యోగి సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజీఎం బి.సత్యనారాయణ,ఎం.వి.టి.సి. మేనేజర్ మల్లన్న, డి.వై.ఎస్.ఇ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com